



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 సంచిక :22 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :22 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 27 SEPTEMBER 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# డిక్లరేషన్ సాంప్రదాయాన్ని జగన్ పాటిస్తే బాగుంటుంది!

## దేవుడి జోలికెళితే ఏమవుతుందో జగన్ ఎన్నికల్లో చూశారన్న లోకేశ్

## మనం ఏ మతానికి చెందినా, అన్ని మతాలను గౌరవించాలని హితవు

## రెడ్ బుక్ పని ప్రారంభమైంది... తప్పుచేసిన వారిని వదలబోమని వార్నింగ్



**పెన్ పవర్ డెస్క్:** శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారం నేపథ్యంలో, మాజీ సీఎం జగన్ ఈ నెల 28న తిరుమల వెళ్లి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలని నిర్ణయించుకోవడం తెలిసిందే. అయితే, జగన్ తన తిరుమల పర్యటన సందర్భంగా ఆలయంలో డిక్లరేషన్ ఇస్తే బాగుంటుందని ఏపీ మంత్రి నారా లోకేశ్ సూచించారు. మనం ఏమతానికి చెందిన వారమైనా అన్నిమతాలను గౌరవించాలని హితవు పలికారు. తాము చర్చి, మసీదులకు వెళ్లినపుడు వారి మత విశ్వాసాలకు అనుగుణంగా నడుచుకుంటామని స్పష్టం చేశారు. జగన్ దేవుడి జోలికి వెళితే ఏమైందో గత ఎన్నికల్లో మీరంతా చూశారు అని లోకేశ్ వ్యాఖ్యానించారు. శ్రీకాకుళంలో ఓ పాఠశాల పరిశీలన అనంతరం లోకేశ్ మీడియాతో మాట్లాడారు.

"తిరుమల వెళతానంటున్న జగన్ డిక్లరేషన్ ఇచ్చే సాంప్రదాయాన్ని పాటిస్తే బాగుంటుంది. తిరుమల లడ్డూ నాణ్యతా లోపంతో పాటు అనేక సమస్యలను భక్తులు యువగళం పాదయాత్రలో నా దృష్టికి తెచ్చారు. అధికారంలోకి వచ్చాక టీటీడీని ప్రక్షాళన చేయాలని ఈవోకు చెప్పాం. నెయ్యి సరఫరా చేసే కంపెనీ టర్నోవర్ రూ.250 కోట్లు ఉండాలన్న నిబంధనను వైవి సుబ్బారెడ్డి రూ.150 కోట్లకు తగ్గిస్తూ ఎందుకు సవరించారు? తిరుమలలో జరిగిన అవకతవకలపై నిగ్గు తేల్చేందుకు కమిటీ వేశాం. ఆ కమిటీ విచారణలో వాస్తవాలు బయటకు వస్తాయి. ఇప్పుడు తిరుమల లడ్డూ క్వాలిటీ బాగుందని వైసీపీ ప్రజాప్రతినిధులు కూడా చెబుతున్నారు.

**జగన్ మాదిరి మేం పారిపోయే వ్యక్తులం కాదు!**

జగన్ లా మేం పారిపోయే వ్యక్తులం, కాదు. ఇప్పటికే




## పరువు నష్టం కేసులో ఎంపీ సంజయ్ రౌత్ కు జైలు శిక్ష

- పరువునష్టం కేసులో 15 రోజుల జైలు
- రూ.25 వేల జరిమానా కూడా విధించిన మేజిస్ట్రేట్
- రౌత్ పై కేసు పెట్టిన బీజేపీ నేత కిరీట్ సోమయ్య భార్య

**పెన్ పవర్ డెస్క్:** శివసేన (యూబీటీ) నేత, రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్ కు ముంబయి మెట్రోపాలిటన్ కోర్టు జైలు శిక్ష విధించింది. పదిహేను రోజుల జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా కూడా విధించింది. ఈమేరకు ఓ కేసులో గురువారం తీర్పు వెలువరించింది. బీజేపీ నేత కిరీట్ సోమయ్య, ఆయన భార్య డాక్టర్ మేధా కిరీట్ సోమయ్యలపై సంజయ్ రౌత్ చేసిన

వివరాలు 2లో..



## 'గో బ్యాక్ క్రిస్టియన్ జగన్'

### అలిపిరి వద్ద స్వాముల నిరసన

- నేడు తిరుమలకు వెళ్తున్న జగన్
- జగన్ పర్యటనను అడ్డుకుంటామంటున్న స్వామీజీలు
- భార్యతో కలిసి స్వామికి పట్టు వస్త్రాలు ఎందుకు సమర్పించలేదని ప్రశ్న

**పెన్ పవర్ డెస్క్:** తిరుమల లడ్డూ ప్రసాదం నాణ్యతపై తీవ్ర వివాదం జరుగుతున్న సంగతి తెలిసిందే. వైసీపీ హయాంలో లడ్డూకు వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందనే వార్తలు కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ అధినేత జగన్ రేపు తిరుమల కొండపైకి వెళుతున్నారు. ఎల్లుండి ఆయన శ్రీవారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో జగన్ తిరుమల పర్యటనను వ్యతిరేకిస్తూ పలువురు స్వామీజీలు ఆందోళనకు దిగారు. అలిపిరి వద్ద శ్రీనివాసానంద స్వామీజీతో పాటు పలువురు స్వామీజీలు నిరసనకు దిగారు. 'గోబ్యాక్ క్రిస్టియన్ జగన్'

వివరాలు 2లో..



## సిగ్గులేకుండా ఇంకా దర్శనానికి వెళుతున్నారా?:

### రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

- లడ్డూ ప్రసాదం అపవిత్రంపై హిందువులంతా బాధపడుతున్నారన్న రాజాసింగ్
- హిందువులంతా తిడుతున్నారని, కనిపిస్తే చంపేస్తారని వ్యాఖ్య
- పవన్ కల్యాణ్ చెప్పినట్లు సనాతన ధర్మ రక్షణకు హిందూ బోర్డ్ అవసరమన్న రాజాసింగ్

వివరాలు 2లో..

## సీబీఐకి డోర్లు క్లోజ్ చేసిన కర్ణాటక... ముడా కేసుకు సంబంధం లేదన్న కాంగ్రెస్

- ముడా స్కాంలో కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని డిమాండ్లు
- ఈ క్రమంలో సీబీఐకి కర్ణాటక ప్రభుత్వం అనుమతి నిరాకరణ
- సీబీఐ పక్షపాతంతో వ్యవహరిస్తున్నందునే ఈ నిర్ణయం తీసుకున్నామన్న కాంగ్రెస్



**పెన్ పవర్ డెస్క్:** ముడా (మైసూరు నగరాభివృద్ధి సంస్థ) స్కాం నేపథ్యంలో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కర్ణాటకలో కేసులు విచారించేందుకు సీబీఐకి సిద్ధరామయ్య ప్రభుత్వం అనుమతిని నిరాకరించింది. ముడా కుంభకోణం కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో సీబీఐకి డోర్లు మూసేయడం

వివరాలు 2లో..

## నా ఇంటిపైకి పవన్ కల్యాణ్ ఒక ప్లాన్ ప్రకారం కార్యకర్తలను పంపారు... నేను భయపడను

### పేర్ని నాని ఇంటి వద్ద జనసైనికుల ఆందోళన

### ఉడుత ఊపులకు భయపడనన్న పేర్ని నాని

### హిందువులను పవన్ రెచ్చగొడుతున్నారని మండిపాటు

వివరాలు 2లో..

**పెన్ పవర్ డెస్క్:** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై వైసీపీ నేత పేర్నినాని చేసిన వ్యాఖ్యలపై జనసైనికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేర్ని నాని ఇంటి ముందు ఆందోళన చేపట్టి... ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ నేపథ్యంలో అక్కడకు చేరుకున్న పోలీసులు కొందరు జనసేన నేతలను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారిని అక్కడి నుంచి పంపించేశారు. ఈ నేపథ్యంలో పేర్ని నాని మాట్లాడుతూ...





## పేర్ని నానీ... గుడివాడలో కొట్టినా బుద్ధి రాలేదా? పళ్లు రాలిపోతాయ్

### జగన్ కు వేంకటేశ్వరస్వామిపై విశ్వాసం లేదన్న రవీంద్ర

### జగన్ ను వెనకేసుకురావడానికి సిగ్గుగా లేదా అని నానికి ప్రశ్న

### నోటికొచ్చినట్టు వాగితే బుద్ధి చెపుతామని హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నానిపై ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తిరుమల లడ్డూ వివాదంపై పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... రవాణా శాఖ మంత్రిగా పని చేసినప్పటికీ... బందరు బస్టాండ్ ను అభివృద్ధి చేయలేదని... ఇప్పుడు లడ్డూ అంశంలో పిచ్చిపిచ్చిగా వాగుతున్నాడని మండిపడ్డారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే పళ్లు రాలిపోతాయని హెచ్చరించారు. మీ అధినేత జగన్ కు కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిపై విశ్వాసం లేదు... అలాంటి వ్యక్తిని వెనకేసుకురావడానికి నీకు సిగ్గుగా లేదా? అని ప్రశ్నించారు. వేంకటేశ్వరస్వామిపై నమ్మకం ఉంటే స్వామివారికి ఐదేళ్లలో ఒక్కసారైనా సతీసమేతంగా పట్టు వస్త్రాలను సమర్పించారా? అని నిలదీశారు. మొన్న గుడివాడలో నిన్ను జనాలు కొట్టినా సిగ్గు రాలేదా? అని ఎద్దేవా చేశారు.

వివరాలు 2లో..

## పరమ నిక్కృష్టుడివి... నీలాంటి వాళ్లకు టీడీపీలో స్థానం లేదు

- విజయసాయి, అచ్చెన్న మధ్య పేలుతున్న మాటల తూటాలు
- పంచభూతాలను కూడా కబ్జా చేసే నిక్కృష్టుడివి అన్న అచ్చెన్న
- చేసిన తప్పుకు శిక్ష అనుభవించాల్సిందేనని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, టీడీపీ నేత, మంత్రి అచ్చెన్నాయుడు మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. కమ్మ కుల పార్టీ టీడీపీలోకి వచ్చేందుకు తాను ప్రయత్నించానా అని అచ్చెన్నపై విజయసాయి మండిపడ్డ సంగతి తెలిసిందే. అచ్చెన్న శరీరాకృతిని కించపరిచే వ్యాఖ్యలు కూడా చేశారు. విజయసాయి వ్యాఖ్యలకు అచ్చెన్న అదే స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. విజయసాయిరెడ్డీ... నీలాగా ఆర్థిక దోపిడీ చేసే దుర్మార్గపు బుద్ధి, ఆర్థిక నేరాలకు సలహాలు ఇచ్చే దరిద్రపు బుద్ధి మాకు, మా పార్టీ వాళ్ళకు లేవు అంటూ అచ్చెన్నాయుడు



వివరాలు 2లో..

## నేను కులపార్టీలో చేరేందుకు ప్రయత్నించానా?



- దేహం పెరిగినట్టుగా మెదడు పెరగలేదన్న విజయసాయి
- మీ చేష్టలు వింతగా ఉంటాయని ఎద్దేవా
- మోకాలికి, బోడి గుండుకు లంకె పెడుతుంటావని విమర్శ

**పెన్ పవర్ డెస్క్:** టీడీపీ నేత, మంత్రి అచ్చెన్నాయుడిపై వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విజయసాయిరెడ్డి టీడీపీలోకి వచ్చేందుకు ప్రయత్నించారంటూ అచ్చెన్న చేసిన వ్యాఖ్యలపై ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... "అచ్చెన్నాయుడూ! దేముడు నిన్ను పుట్టించేటప్పుడు మెదడు, బుద్ధి, జ్ఞానం 0.1% మాత్రమే ఇచ్చాడాయె! చిన్నప్పుడు మీ ఫ్రెండ్స్. అచ్చి.. బుచ్చి... కచ్చి...

వివరాలు 2లో..

## జనసేనలో చేరిన బాలినేని, సామినేని ఉదయభాను, కిలారి రోశయ్య... కండువా కప్పిన పవన్ కల్యాణ్

- ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన బాలినేని శ్రీనివాసరెడ్డి
- పవన్ సమక్షంలో జనసేన పార్టీలో చేరిక
- సామినేని ఉదయభాను, కిలారి రోశయ్య కూడా జనసేనలోకి ఎంట్రీ
- పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్న పవన్

**పెన్ పవర్ డెస్క్:** జగన్ బంధువు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఈ సాయంత్రం జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో... బాలినేనికి అధినేత పవన్ కల్యాణ్

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# భారత్ కు బూస్టింగ్ ఇస్తున్న ఆర్థిక సంస్థలు

వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ఒకటి. అందులో ఆర్థికంగా మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఇప్పుడు ఆర్థికంగా దేశం 5వ స్థానంలో ఉంది. మరో మూడు నుంచి నాలుగేళ్లలో 3వ స్థానానికి తీసుకెళ్తానని మోడీ హామీ ఇచ్చారు. భారత ఆర్థిక అభివృద్ధి వేగాన్ని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్ వరకు అన్ని ప్రపంచ సంస్థలు విశ్వసించాయి. రేటింగ్ ఏజెన్సీ మూడీస్ కూడా ఈ జాబితాలో చేరి భారత్ (మూడీస్ ఇండియా జీడీపీ) జీడీపీ వృద్ధి అంచనాను పెంచింది. 2024 క్యాలెండర్ ఇయర్ లో భారత్ 7.1 శాతం వృద్ధిని సాధిస్తుందని మూడీస్ తెలిపింది. భారతదేశ జీడీపీ వృద్ధి అంచనాను మూడీస్ 7.1 శాతానికి సవరించింది. అంతకుముందు రేటింగ్ ఏజెన్సీ 6.8 శాతం అంచనా వేసింది. అలాగే, గ్లోబల్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ తన కొత్త ఆసియా-పసిఫిక్ అవుట్ లుక్ లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి దేశ వృద్ధి అంచనాను 6.5 శాతం వద్ద యథాతథంగా ఉంచింది, 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 6.6 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేసింది.మూడీస్ అనలిటిక్స్ కొత్త నివేదికలో భారత్ లో ద్రవ్యోల్బణ రేటును కూడా ప్రస్తావించింది. మూడీస్ దేశ ఆర్థిక వృద్ధి అంచనాను 30 బేసిస్ పాయింట్లు సవరించగా.., భారత ద్రవ్యోల్బణ అంచనాను 5 శాతం నుంచి 4.7 శాతానికి తగ్గించింది. దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం జూలై, ఆగస్ట్ లో ఆర్బీఐ నిర్దేశిత పరిధిలో 4 శాతం కంటే తక్కువగా ఉంది. రేటింగ్ ఏజెన్సీ ప్రకారం ఆర్థిక సంవత్సరం 2025-26లో భారతదేశంలో ద్రవ్యోల్బణం రేటు ఇప్పుడు వరుసగా 4.5 శాతం, 4.1 శాతంగా అంచనా వేయబడింది.మూడీస్ మాత్రమే కాదు, ప్రపంచ బ్యాంకు నుంచి ఐఎంఎఫ్, ఇతర అంతర్జాతీయ సంస్థలు కూడా భారత ఆర్థిక వ్యవస్థపై విశ్వాసం కలిగి ఉన్నాయని, అందరూ దేశ జీడీపీ వృద్ధి అంచనాను పెంచారన్నారు. మౌలిక సదుపాయాలపై ప్రభుత్వ వ్యయం, స్థిరాస్తిలో పెరిగిన దేశీయ పెట్టుబడులు, మెరుగైన రుతుపవనాల కారణంగా ప్రపంచ బ్యాంకు 2025 ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి అంచనాను 6.6 శాతం నుంచి 7 శాతానికి పెంచగా, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి అంచనాను 20 బేసిస్ పాయింట్లు పెంచి 7 శాతానికి పెంచింది.భారత జీడీపీ వృద్ధి అంచనాలను ప్రపంచ బ్యాంక్ సవరించింది. 2024-25 ఆర్థిక ఏడాదిలో 7 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. గతంలో 6.6 శాతంగా నమోదు కావొచ్చని పేర్కొన్న ప్రపంచబ్యాంక్.. తన అంచనాలను మార్పు చేసింది. వ్యవసాయ రంగం, గ్రామీణ ఆర్థికవ్యవస్థ ఆశించిన స్థాయిలో రికవరీ అవుతుండడమే దీనికి కారణమని విశ్లేషించింది. ప్రపంచ భౌగోళిక రాజకీయ సవాళ్లు ఉన్నా భారత్ ఆర్థికవ్యవస్థ రాణిస్తుందని పేర్కొంది. ఏప్రిల్- జూన్ త్రైమాసికానికి ఇటీవల భారత జీడీపీ వృద్ధి రేటు నెమ్మదించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం వెలువరించిన గణాంకాల ప్రకారం 6.7 శాతంగా నమోదైంది. ఎప్పుడో ఈ గణాంకాలు వెలువడాల్సిఉన్నా.. ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడ్డాయి. ఇటీవల ఆర్బీఐ ద్రవ్యపరపతి విధాన సమీక్ష సమావేశంలో భారత్ తొలి త్రైమాసికంలో 7.1 శాతం వృద్ధి నమోదు కావొచ్చని అంచనా వేసింది. కానీ అంతకంటే తక్కువే నమోదైంది. ఈ క్రమంలోనే నొమురా పూర్తి ఏడాదికి వృద్ధి అంచనాలను 6.9 శాతం నుంచి 6.7 శాతానికి తగ్గించింది. గోల్డ్‌మాన్ శాక్స్, జేపీ మోర్గాన్ వంటి సంస్థలు 6.5 శాతంగా ఉండొచ్చని పేర్కొన్నాయి. ప్రపంచబ్యాంక్ మాత్రం 7 శాతం నమోదుకావొచ్చని పేర్కొంది.భారత్ తో పాటు ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్ అండ్ పీల విశ్వాసం కూడా భారత్ పైనే ఉంది. ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరానికి భారత వృద్ధి రేటు అంచనాను 6.8 శాతంగా ఏజెన్సీ కొనసాగించింది. దీనితో పాటు, అమెరికా పాలసీ రేటు తగ్గింపు తర్వాత దేశంలో రెపో రేటు తగ్గుతుందని అంచనా. అక్టోబర్ లో జరిగే ఎంపీసీ సమావేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్ బీఐ) వడ్డీరేట్ల తగ్గింపునకు శ్రీకారం చుట్టవచ్చని ఎస్ అండ్ పీ తెలిపింది.

# డిక్లరేషన్ సాంప్రదాయాన్ని జగన్ పాటిస్తే బాగుంటుంది!

- మొదటి పేజి తరువాయి

పెన్షన్లు, మెగా డీఎస్సీ హామీలను అమలు చేశాం. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇస్తామని ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించారు. పథకాల అమలుపై మాకు చిత్తశుద్ధి ఉంది. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాం.

జగన్ లా పరదాలు కట్టుకుని మేం తిరగడంలేదు. తప్పు చేయకపోతే వారు ఎందుకు భయపడ్డారు? ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలమధ్య ప్రజావేదిక నిర్వహిస్తున్నారు.

**సాక్షి చదివినా,చూసినా ఆరోగ్యానికి హానికరం**

సాక్షి చదివినా, చూసినా ఆరోగ్యానికి హానికరం. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ చేయబోమని కేంద్రమంత్రి కుమారస్వామి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టంగా చెప్పారు.

ప్రైవేటీకరణ లేదని నేను, మా ఎమ్మెల్యేలందరం నిన్న స్పష్టంచేశాం. విశాఖ ఉక్కును బతికించడం కోసం నిధులు మంజూరు చేయాల్సిందిగా ముఖ్యమంత్రి కేంద్రాన్ని కోరారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించారు. వైసీపీ నాయకులు ఎందుకు కంగారు పడుతున్నారో అర్థం కావడం లేదు. ఇటీవల వరదలు సంభవించిన సమయంలో కష్టకాలంలో ఉన్న ప్రజలకు మేం అండగా నిలబడ్డాం. జగన్ ప్రజాధనంతో 2 బుల్లెట్ ప్రూఫ్ కార్లు కొనుక్కున్నారు కానీ ఏ నాడు జనం ముందుకు వెళ్లలేదు. ఎవరు అసలైన ప్రజానాయకులో రాష్ట్రప్రజలకు అర్థమైంది.

**రెడ్ బుక్ పని ఇప్పటికే ప్రారంభమైంది**

ఎవరైతే చట్టాన్ని ఉల్లంఘించారో వారికి శిక్ష తప్పదని నేను చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నా. ఆ ప్రకారం ఇప్పటికే రెడ్ బుక్ అమలు ప్రారంభమైంది. చట్టాన్ని అతిక్రమించి తప్పు చేసిన వారిని వదిలేది లేదు. ఇందులో భాగంగా ఐపీఎస్ లు కూడా సస్పెండ్ అయ్యారు. రైట్ ప్లేస్ లో రైట్ పర్సన్ ఉండాలన్నదే మా ప్రభుత్వ అభిమతం.

# సిగ్గులేకుండా ఇంకా దర్శనానికి వెళుతున్నారా?:

**పెన్ పవర్ డెస్క్:**తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారనే విషయం తెలిసి హిందువులంతా ఎంతో బాధపడుతున్నారని, ఇలాంటి పాపిష్టులు కూడా ఈ ప్రపంచంలో ఉన్నారా? అని చర్చించుకుంటున్నారని బీజేపీ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. ఇంత పాపం చేసిన తర్వాత కూడా ఇంకా సిగ్గులేకుండా మళ్లీ తిరుమల దర్శనానికి వెళ్లడం ఏమిటని వైసీపీ అధినేత జగన్‌ను ఉద్దేశించి అన్నారు. హిందూ ధర్మాన్ని గౌరవించకుంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ప్రసాదాన్ని అపవిత్రం చేసినందుకు హిందువులు అందరూ తిడుతున్నారని, దొరికితే మాత్రం చంపేస్తారని సంచలన వ్యాఖ్యలు చేశారు.ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఓ మంచి మాట చెప్పారని, ఒక సనాతన ధర్మ రక్షణకు ఓ హిందూ బోర్డ్ అవసరమని చెప్పారని ప్రశంసించారు. మన గుడిని, మన ప్రసాదాన్ని అపవిత్రం చేయాలని చూస్తే వారికి బుద్ధి చెప్పాలన్నారు. ఏపీలోని ఎన్నో దేవాలయాలలో ఇతర మతస్తులు ఉద్యోగం చేస్తున్నారని, హిందూ ధర్మంపై నమ్మకం లేని వారికి మన గుళ్లలో ఉద్యోగాలు ఎందుకు? అని ప్రశ్నించారు.

మన గుళ్లలో పని చేసే ఇతర మతస్తులను వెంటనే తొలగించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేకపోతే తిరుపతి, శ్రీశైలం లాంటి ప్రాంతాల్లో ఇతర మతస్తులు వచ్చి మత మార్పిడి చేసే అవకాశం ఉందన్నారు. ఏపీ ప్రభుత్వం తక్షణమే టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి దేవాలయ, ఆలయ భూములను కాపాడాలని కోరారు. తిరుమలను ఎంతో పవిత్రంగా ఉంచాలని కోరారు. భారత్ నుంచి మాత్రమే కాదని, వివిధ దేశాల నుంచి కూడా శ్రీవారి దర్శనానికి వస్తారని చెప్పారు. శ్రీవారి ప్రసాదం అపవిత్రం కావడంపై హిందువులంతా బాధపడుతున్నారన్నారు. ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వాళ్లు తిరుమలకు వెళ్లడం సరైంది కాదన్నారు.

# పరమ నికృష్టుడివి... నీలాంటి వాళ్లకు టీడీపీలో స్థానం లేదు

- మొదటి పేజి తరువాయి

మండిపడ్డారు. "పంచభూతాలను కూడా కబ్జా చేసే పరమ నికృష్ట మనిషివి... వేరే వాళ్ళ గురించి నువ్వు మాట్లాడే సంస్కారాన్ని బట్టి నీకు చాలా తీవ్రమైన మానసిక సమస్య ఉందని అర్థమవుతోంది... కర్మ నీ దూల తీర్చే సమయం వచ్చింది... సుదీర్ఘకాలం జైలు జీవితానికి సిద్ధంగా ఉండు" అని పేర్కొన్నారు.

భగవంతుడు తమకు ప్రజలకు సేవ చేసే బుద్ధి ఇచ్చాడని అచ్చెన్న వివరించారు. చేసిన పాపాలకు శిక్ష తప్పదని గ్రహించి వైసీపీ నుంచి టీడీపీలోకి వద్దామని నీవు విశ్వప్రయత్నాలు చేశావంటూ ఎద్దేవా చేశారు. నీలాంటి నేరగాళ్లకు, ఆర్థిక ఉన్మాదులకు టీడీపీలో స్థానం లేదని తేల్చడంతో దిక్కు తోచక పిచ్చి వాగుడు వాగుతున్నావు అని దుయ్యబట్టారు. నువ్వు, నీ నాయకుడు జగన్ ఎన్ని వేషాలు వేసినా... మీ పాపం పండింది, చేసిన ప్రతి తప్పుకు శిక్ష అనుభవించాల్సిందే అని స్పష్టం చేశారు.

# జనసేనలో చేరిన బాలినేని, సామినేని ఉదయభాను, కిలారి రోశయ్య... కండువా కప్పిన పవన్ కల్యాణ్

- మొదటి పేజి తరువాయి

పార్టీ కండువా కప్పి, జనసేనలోకి సాదరంగా స్వాగతం పలికారు. ఇటీవలే బాలినేని వైసీపీకి గుడ్ బై చెప్పిన సంగతి తెలిసిందే.ఇక, వైసీపీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, కిలారి రోశయ్య కూడా బాలినేనితో పాటు ఇవాళ జనసేన పార్టీలో చేరారు. ఉదయభాను, కిలారి రోశయ్యలకు

జనసేనాని పవన్ కల్యాణ్ పార్టీ కండువా కప్పారు. పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పవన్ వారికి సూచించారు.

# సీబీఐకి డోర్లు క్లోజ్ చేసిన కర్ణాటక... ముడా కేసుకు సంబంధం లేదన్న కాంగ్రెస్

- మొదటి పేజి తరువాయి

చర్చనీయాంశంగా మారింది.తమ పార్టీ నాయకులను బీజేపీ లక్ష్యంగా చేసుకుందని న్యాయ శాఖ మంత్రి హెచ్‌కె పాటిల్ అన్నారు. ముఖ్యంగా ఎన్నికలకు ముందు తమ పార్టీ నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. సీఎం సిద్ధరామయ్య ఎదుర్కొంటున్న ముడా కుంభకోణం ఆరోపణలకు, సీబీఐని రాష్ట్రంలోకి రాకుండా నిర్ణయం తీసుకోవడానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వం కేంద్ర విచారణ సంస్థలను దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. పక్షపాతంతో వ్యవహరిస్తున్నందు వల్లే తాము ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. "ముడా కుంభకోణం కేసుకు సీబీఐకి అనుమతి నిరాకరించడానికి సంబంధం లేదు" అని తేల్చి చెప్పారు. తాము సీబీఐకి సూచించిన పలు కేసులలో ఛార్జిషీట్ దాఖలు చేయలేదని, చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

## 'గో బ్యాక్ క్రిస్టియన్ జగన్'

- మొదటి పేజి తరువాయి

అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. సీఎంగా ఉన్నప్పుడు భార్యతో కలిసి ఏనాడూ స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించని జగన్... ఇప్పుడు తిరుమలకు ఎందుకు వస్తున్నారని స్వామీజీలు మండిపడ్డారు. వైసీపీ పాలనలో ఆలయాలపై ఎన్నో దాడులు జరిగినా ఒక్క రోజు కూడా జగన్ నోరు మెదపలేదని విమర్శించారు. జగన్ తిరుమల పర్యటనను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. జగన్ పర్యటన సమయంలో శాంతిభద్రతల సమస్య తలెత్తితే... దానికి ఆయనే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు.

# పేర్ని నానీ... గుడివాడలో కొట్టినా బుద్ధి రాలేదా? పళ్లు రాలిపోతాయ్

- మొదటి పేజి తరువాయి

ఈసారి బందరు ప్రజలు నిన్ను తరిమి కొడతారని చెప్పారు. ఇంకోసారి నోటికొచ్చినట్టు వాగితే... నోరు మూసుకునేలా బుద్ధి చెపుతామని హెచ్చరించారు.

**పేర్ని నాని ఏమన్నారంటే..**

"తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని దుష్ప్రచారం చేస్తున్నారు. స్వామి ప్రసాదాన్ని రాజకీయాలకు వాడుకుంటున్నారు. చంద్రబాబు, లోకేశ్ లవి దుర్మార్గపు మాటలు. ఆ మాటలను పవన్ కల్యాణ్ భుజాన వేసుకుని ప్రచారం చేస్తున్నాడు.

కూటమి నేతలు తిరుమల పవిత్రతను అపవిత్రం చేశారు. కూటమి నేతల పాపాలను క్షమించి వదిలేయాలని ఈ నెల 28న పూజలు చేస్తాం" అని పేర్ని నాని అన్నారు.

# పరువు నష్టం కేసులో ఎంపీ సంజయ్ రౌత్ కు జైలు శిక్ష

- మొదటి పేజి తరువాయి

ఆరోపణలకు సంబంధించిన కేసులో కోర్టు ఈ తీర్పు వెలువరించింది. మీరా భాయందర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం, నిర్వహణలో భారీ స్కాం జరిగిందని సంజయ్ రౌత్ గతంలో ఆరోపణలు చేశారు.ఈ వ్యవహారంలో కిరీట్ సోమయ్య దంపతులు రూ.100 కోట్ల స్కాం చేశారని విమర్శించారు. దీనిపై తీవ్రంగా మండిపడ్డ డాక్టర్ మేధా కిరీట్ సోమయ్య.. సంజయ్ రౌత్ పై పరువునష్టం దావా వేశారు. ఈ దావాను విచారించిన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్.. సంజయ్ రౌత్ నిరాధార ఆరోపణలు చేశారని నిర్ధారించారు. తప్పుడు ఆరోపణలు చేసి కిరీట్ సోమయ్య దంపతులకు పరువునష్టం కలిగించారని తేల్చి ఎంపీకి 15 రోజుల జైలు, రూ.25 వేల జరిమానా విధించారు.

# నా ఇంటిపైకి పవన్ కల్యాణ్ ఒక ప్లాన్ ప్రకారం కార్యకర్తలను పంపారు... నేను భయపడను

- మొదటి పేజి తరువాయి

ఉడుత ఊపులకు, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని అన్నారు. సినిమా హీరోగా రాజకీయాల్లోకి అడుగు పెట్టిన పవన్... నోటికొచ్చినట్టు, ఒక సిద్ధాంతం అనేది కూడా లేకుండా ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

హిందువులను రెచ్చగొడుతున్నారని... బాధ్యతాయుతమైన డిప్యూటీ సీఎం పదవిలో ఉండి అలా చేయడం సిగ్గుచేటని అన్నారు. నిన్న మధ్యాహ్నం తాను పవన్ ను ప్రశ్నించానని... అందుకే ఒక ప్లాన్ ప్రకారం జనసేన కార్యకర్తలను ఈరోజు తన ఇంటిపైకి పవన్ పంపించారని దుయ్యబట్టారు. మా ఇంటికి మీ ఇల్లు ఎంత దూరమో... మీ ఇంటికి కూడా మా ఇల్లు అంతే దూరమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

# అక్టోబర్ 1 నుంచి ధాన్యం కొనుగోళ్లు

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై ఏపీ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. వికేంద్రీకరణ విధానంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టనున్నట్లు తెలిపింది. రైతు సేవా కేంద్రాలు, ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ-పంట, ఈ కేవైసీ సమాచారంతో రైతులు, కౌలు రైతుల ధాన్యం కొనుగోళ్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. ధాన్యం కొనుగోలు తర్వాత ఆధార్ అనుసంధానమైన ఈ-పంట , ఈ-కేవైసీ ద్వారా రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.రాష్ట్ర స్థాయిలో ధాన్యం కొనుగోళ్లకు పౌరసరఫరాల శాఖ, ఏపీ మార్క్ ఫెడ్ సంస్థలు నోడల్ ఏజెన్సీలుగా పనిచేస్తాయని ప్రభుత్వం జీవోలో స్పష్టం చేసింది. ధాన్యం కొనుగోలు చేసే రైస్ మిల్లర్లు కూడా ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ లో నమోదు చేసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. అలాగే కేంద్ర ప్రభుత్వం వరికి నిర్దేశించిన కనీస మద్దతు ధర సాధారణ రకం క్వింటాల్ కు రూ.2300, గ్రేడ్ ఏ రకం క్వింటాల్ కు రూ.2320 చెల్లించాలని వెల్లడించింది.

ఈ ఖరీఫ్ సీజన్ లో 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ధాన్యం సేకరణ, మిల్లింగ్ ఆపరేషన్ల పర్యవేక్షణను జిల్లా కలెక్టర్లు, జేసీలను అప్పగించింది.ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఏపీ ప్రభుత్వం ఇటీవల కీలక ప్రకటన చేసింది. అక్టోబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ప్రారంబమవుతుందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై ఇటీవల జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారులతో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి నాదెండ్ల మనోహర్? ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాకి సొమ్ము చేరుతుందని వెల్లడించారు. రైతు పండించిన ప్రతి గింజా కొనే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ధాన్యం అమ్మకం, మిల్లుల ఎంపికలో రైతుకే స్వేచ్ఛ ఉంటుందని తెలిపారు. ప్రతి అడుగులో పారదర్శకంగా వ్యవహరిస్తామని ప్రతీ రైతుకీ భరోసా ఇస్తామని స్పష్టం చేశారు.

# నేను కులపార్టీలో చేరేందుకు ప్రయత్నించానా?

- మొదటి పేజి తరువాయి

అని ఆట పట్టించేవారట కదా! దేహం పెరిగినట్టుగా మెదడు వృద్ధి చెందక పోవడం వల్ల మీ చేష్టలు, మాటలు అన్నీ వింతగా ఉంటాయి. మోకాలికి, బోడి గుండుకు లంకె పెడుతుంటావు. నా విధేయత, కమిట్మెంట్, నిబద్ధతలపై జోకులు పేలుస్తున్నావు. విజయసాయిరెడ్డి అనే నేను టీడీపీ అనే కులపార్టీలో చేరేందుకు ప్రయత్నించానా? అచ్చెన్నా... నువ్వు ఎంత గట్టిగా అనుకున్నా ఈ జన్మకి నీ కోరిక తీరదయ్యా! భ్రమల లోకంలో గెంతులేయాలనుకుంటే, గో...ఆన్... నిన్ను ఆపేదెవరు. జత ఎద్దులకుండే బలం ఉంది నీ ఒక్కడికి. మేథో శక్తికి, అడ్డం-నిలువుకు మధ్య ఉండే తేడా తెలియక పోవడం వల్లే మీతో ఈ సమస్యంతా" అని ట్వీట్ చేశారు.

# భారత స్వాతంత్ర్యోద్యమంలో, నిరంకుశ నిజాం వ్యతిరేక ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్న నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

## -నేడు ఆయన జయంతి



భారత స్వాతంత్ర్యోద్యమంలో, నిరంకుశ నిజాం వ్యతిరేక ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్న నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ... అదేవిధంగా దేశ స్వాతంత్రానంతరం, నిరంకుశ నిజం పాలన ముగిసిన తర్వాత తెలంగాణ జెండాను ఎత్తిన తొలి తరం నేతల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ ఒకరు. ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం పదవులను గడ్డిపోచలా భావించారు. తొలి దశ ఉద్యమంలో హింసాకాండను నిరసించి, కాంగ్రెస్ ప్లీనరీలో నిలదీశారు. కాసు కేబినెట్ నుంచి తప్పుకుని ప్రత్యేక తెలంగాణకోసం మంత్రి పదవి వదులుకున్న మొదటి వ్యక్తిగా నిలిచారు. ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నాలను ఎదుర్కొని, తన నివాసం 'జలదృశ్యం'లోనే ఎమ్మెల్యేలను కూడగట్టారు. ఈ జల దృశ్యమే మలి దశ పోరుకి వేదికయ్యింది. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థులు రోజూ ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు చేపట్టింద్రు. వారిపై పోలీసులు, మలబార్ నుంచి వచ్చిన మిలటరీ, గూర్ఖా రైఫిల్స్ సైన్యం జరిపిన కాల్పుల్లో అభం శుభం ఎరుగని పిల్లలు, విద్యార్థులు అమరులయ్యింద్రు. ప్రతి పాఠశాల, కళాశాల ఓపెన్ ఎయిర్ జైలుగా మారింది.

**మంత్రి పదవిని త్యాగం చేసిన మొదటి వ్యక్తి:**
విద్యార్థులపై పోలీసుల కాల్పులకు నిరసనగా కొండా లక్ష్మణ్ బాపూజీ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీలో గొంతు విప్పారు. కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో ఉన్న ఆయన.. పదవికి రాజీనామా చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం మంత్రి పదవి వదులుకున్న మొదటి వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ. 1969లో ఏర్పడ్డ తెలంగాణ ప్రజా సమితి యాక్షన్ కమిటీకి బాపూజీ శాశ్వత ఆహ్వానితుడు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బాపూజీ అధ్యక్షతన తెలంగాణ ప్రజా సమితి అనే రాజకీయ పార్టీగా మారింది. లోక్సభ ఎన్నికల్లో పోటీ కూడా చేసింది.

నిరంకుశ నిజాం వ్యతిరేక, తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖుడైన కొండా లక్ష్మణ్ బాపూజీ అదిలాబాద్ జిల్లా వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబర్ 27న జన్మించాడు. స్వాతంత్ర్యోద్యమంలో, నిరంకుశ నిజాం వ్యతిరేక ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నాడు. 1952లో ఆసిఫాబాదు నుంచి ఎన్నికై హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్ శాసనసభలకు ప్రాతినిధ్యం వహించాడు. ఆ తర్వాత కూడా శాసనసభ్యుడిగా నుంచి ఎన్నికై 1971 వరకు శాసనసభ్యునిగా కొనసాగినాడు. నిఖార్సయిన తెలంగాణ వాది. తెలంగాణ కోసం 1969లో మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా వదిలిలేసిన నిబద్ధత కలిగిన రాజకీయవేత్త. 1969, 2009 రెండు తెలంగాణ ఉద్యమాలలో పాల్గొన్నాడు. రాష్ట్ర చేనేత సహకార రంగానికి కూడా కృషిచేశాడు. సెప్టెంబర్ 21, 2012 నాడు 97 సంవత్సరాల వయస్సులో హైదరాబాదులో మరణించాడు.

## జెత్వానీ కేసులో సజ్జల బుక్కైనట్టేనా

**హైదరాబాద్ పెన్ పవర్:** హీరోయిన్ జెత్వానీ కేసులో ముగ్గురు ఐపీఎస్ అధికారులు నిండా మునిగిపోయే పరిస్థితి వచ్చింది. పరారీలో ఉన్న ఏ వన్ కుక్కల విద్యాసాగర్ ను పోలీసులు డెహ్రాడూన్‌లో పట్టుకుని విజయవాడకు తీసుకు వచ్చి రిమాండ్ కు తరలించారు. రిమాండ్ రిపోర్టులో పోలీసులు సంచలన విషయాలు వెల్లడించారు. కుక్కల విద్యాసాగర్ తో కలిసి ఐపీఎస్‌లు కుట్ర పన్ని జెత్వానీపై తప్పుడు కేసులు పెట్టారని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఇంకా ఎఫ్ఐఆర్లో ఆ ముగ్గురి పేర్లు చేర్చినప్పటికీ వారి మెడకు ఉచ్చ బిగుసుకోవడం ఖాయంగా కనిపిస్తుంది. అయితే విద్యాసాగర్ కోసం ఆ ఐపీఎస్‌లు ఇదంతా చేయలేదని.. అప్పటి ప్రభుత్వ ముఖ్యసలహాదారు సజ్జల ప్రమేయంతోనే ఈ తతంగమంతా నడిచిందంటున్నారు. ముంబయి సినీనటి కాదంబరీ జెత్వానీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుడు కుక్కల విద్యాసాగర్‌ను డెహ్రాడూన్ నుంచి రైలులో అర్ధరాత్రి తీసుకొచ్చిన పోలీసులు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, వైద్య పరీక్షల అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఈ క్రమంలోనే పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌ని కోర్టుకు సమర్పించారు. ఆ రిపోర్టులో సీనియర్ ఐపీఎస్ అధికారులు పి.సీతారామాంజనేయులు , కాంతిరాణా తాతా, విశాల్ గున్నీని నిందితులుగా చేర్చారు. వారితో పాటు అప్పట్లో విజయవాడ వెస్ట్‌జోన్ ఏసీపీగా పనిచేసిన హనుమంతురావు, ఇబ్రహీంపట్నం సీఐగా ఉన్న సత్యనారాయణలను కూడా నిందితులుగా చేర్చారు. విద్యాసాగర్‌తో అధికారులు కుమ్మక్కైనట్లు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ ఐదుగురిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.. అయితే ఎఫ్ఐఆర్‌లో ఇంకా సీతారామాంజనేయులు , కాంతిరాణా తాతా, విశాల్ గున్నీ పేర్లు చేర్చలేదు. నేడో, రేపో ఆ ముగ్గురి పేర్లు ఎఫ్ఐఆర్‌లో చేర్చి అరెస్టులు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అరెస్టు భయంతో ఐపీఎస్ అధికారి కాంతిరాణా టాటా ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకున్నారు. తనపై తప్పుడు కేసు పెట్టారని.. తాను జెత్వానీ విషయంలో నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరించానని కాంతి రాణా టాటా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. మరో ఇద్దరు ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, విశాల్ గున్నీ ఇంకా ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసుకోలేదు. పి.సీతారామాంజనేయులు, కాంతి రాణా, విశాల్‌గున్నీ వై నేత కుక్కల విద్యాసాగర్‌తో కుమ్మక్కై కాదంబరీ జెత్వానీని అక్రమంగా అరెస్ట్ చేసినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. మరోవైపు కుక్కల విద్యాసాగర్‌కు వచ్చే నెల 4 వరకు జడ్జి రిమాండ్ విధించగా విజయవాడ సబ్ జైలుకు తరలించారు. అతడిని పోలీసులు కస్టడీలోకి తీసుకొని విచారిస్తే పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ కేసులో పలు నాన్ బెయిలబుల్ సెక్షన్లు ఉన్న నేపథ్యంలో ముగ్గురు ఐపీఎస్ అధికారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. ముంబైకి చెందిన కాదంబరి జెత్వానీని గత ఫిబ్రవరిలో పోలీసులు అరెస్టు చేశారు. ఓ హీరోయిన్ ను అరెస్టు చేసి తీసుకు వచ్చినా ఎవరికీ తెలియదు. అత్యంత రహస్యంగా అరెస్టు చేసి తీసుకు వచ్చారు. దాదాపుగా నెలన్నర పాటు ఆమెను రిమాండ్ లో ఉంచారు. ఈ లోపు ముంబైలో ఆమె పారిశ్రామిక వేత్త జిందాల్‌పై పెట్టిన కేసులో.. పోలీసుల ఎదుట హాజరు కాలేకపోవడంతో ఆ కేసును కొట్టి వేశారు. ఇందు కోసమే ఆమెను అరెస్టు చేశారని.. జిందాల్‌ను రక్షించడం కోసం.. ఇదంతా చేశారన్న ఆరోపణలను జెత్వానీ చేస్తున్నారు. తనను అక్రమ కేసులో అరెస్టు చేసి వేధించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. జెత్వానీపై కేసు నమోదు చేయడానికి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారని పోలీసులు ఇప్పటికే గుర్తించారు. తనకు తప్పుడు పత్రాలతో భూమి అమ్మారని కుక్కల విద్యాసాగర్ అప్పట్లో చేసిన ఫిర్యాదు మేరకు ఆమెను అప్పట్లో పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే అసలు జెత్వానీ ఎవరికీ భూమి అమ్మకానికి పెట్టలేదని.. ఎవరికీ ఆమె డబ్బులివ్వలేదని తాజా విచారణలో తేలింది. ఆమెపై ఫిర్యాదులో కుక్కల విద్యాసాగర్ పేర్కొన్న వ్యక్తులే ఈ విషయాన్ని విచారణాధికారులకు చెప్పారు. తమకు జెత్వానీతో ఎలాంటి పరిచయం లేదని ఆమె .. స్థలం అమ్మజూపలేదని స్పష్టం చేశారు. ఇలా జెత్వానీపై తప్పుడు కేసు పెట్టడం కోసమే అందరూ కలిసి ఓ ముఠాగా ఏర్పడి వేధించారని తేలడంతో.. కేసులు పెట్టారు. అయితే జెత్వానీ లాంటి సెలబ్రిటీపై విద్యాసాగర్ కేసు పెట్టడం.. దానికి ఐపీఎస్‌లు సహకరించడం వెనుక అప్పటి ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన సలహాదారు సజ్జల రామక?ష్ణారెడ్డి పేరు ప్రధానంగా ఫోకస్ అవుతోంది. ముంబై పారిశ్రామికవేత్త జిందాల్ కోసం జగన్ ఆదేశాల మేరకే సజ్జల కాదంబరీ విషయంలో చక్రం తిప్పారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కేసులో సమగ్ర విచారణ పూర్తైతే ముగ్గురు ఐపీఎస్‌లతో పాటు సజ్జల కూడా జైలు పాలు కావడం ఖాయమంటున్నారు.

## విజయనగరంలో వాల్మికీ రీసెర్చి సెంటర్

**విజయనగరం, సెప్టెంబర్ 26, పెన్ పవర్:** ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా విజయనగరం జిల్లాలో మొట్టమొదటి వాల్మీకి రీసెర్చ్ సెంటర్ ప్రారంభం కానుంది. ఈనెల 27న మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఈ రీసెర్చ్ సెంటర్ ను ప్రారంభించనున్నారు. ఉత్తరాంధ్ర అయోధ్యగా పిలిచే రామనారాయణంలో ఏర్పాటు చేస్తున్న వాల్మీకి రిసెర్చ్ సెంటర్‌ను జాతీయ సంస్కృత యూనివర్శిటి తో అనుసంధానం చేశారు నిర్వాహకులు. ఈ వాల్మీకి రిసెర్చ్ సెంటర్ టిటిడి సంస్కృత యూనివర్శిటి పర్యవేక్షణలో సాగుతుంది. ఇక్కడ టిటిడి సంస్కృత యూనివర్శిటికి చెందిన అధ్యాపకులు నిరంతరం అందుబాటులో ఉంటారు. ఈ రీసెర్చ్ సెంటర్ లో తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సంస్కృతంకు చెందిన నాలుగు భాషల రామాయణ గ్రంథాలు, రచనలు, పాఠ్యపుస్తకాలతో పాటు శ్రీరామునికి చెందిన ఇతర పుస్తకాలు కూడా అందుబాటులో ఉంటాయి. దేశవిదేశాల్లో రామాయణం పై అధ్యయనం చేసే ఆసక్తి ఉన్నవారెవరైనా ఇక్కడ రీసెర్చ్ చేయవచ్చు. రామాయణంలోని నైతిక విలువలతో కూడిన పలురకాల శ్రీరాముని రూపాలు ఇక్కడ రీసెర్చ్ చేసే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్నాయి. రామాయణంపై అనేక మంది అనేక రకాల రామాయణాలు రచించినప్పటికీ వాల్మీకి రామాయణం ప్రధానమైనది. కాగా ఇప్పటివరకు వాల్మీకి రామాయణం పై అధ్యయనం చేసేందుకు ఎక్కడ కూడా రిసెర్చ్ సెంటర్ లేదు. అయితే ఇప్పుడు విజయనగరం రామనారాయణం లో వాల్మీకి రిసెర్చ్ సెంటర్ ప్రారంభం కానుండటంతో రామభక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ అధ్యయనం చేసే విద్యార్థులకు రామనారాయణంలోనే ప్రత్యేకమైన సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశారు నిర్వాహకులు. ధనస్సు ఆకారంలో నిర్మితమైన రామనారాయణంను ఉత్తరాంధ్ర అయోధ్యగా పిలుస్తారు. రామనారాయణంలో భావితరాలకు నైతిక విలువలు అందించేలా రామాయణంలోని పలు ఘట్టాలను రూపొందించి అందుబాటులో ఉంచారు. రామనారాయణంలోని అపురూప ఘట్టాలను, లేజర్ షో ను నిత్యం వేలాది మంది భక్తులు తరలివచ్చి తిలకిస్తుంటారు. రామనారాయణంలో ఇప్పటికే టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న వేద పాఠశాల కూడా ఉంది. ఇప్పుడు రిసెర్చ్ సెంటర్ తో రామనారాయణ ప్రాముఖ్యత మరింత పెరగనుంది. వాల్మీకి రీసెర్చ్ సెంటర్ ప్రారంభం సందర్భంగా ఈ నెల 27, 28, 29వ తేదీల్లో రామాయణం పై నాలుగు భాషల్లో మహా సదస్సు కూడా ప్రపంచంలోనే మొట్టమొదటిసారి జరగనుంది. ఈ మహా సదస్సుకు దేశ విదేశాల్లోనే ప్రముఖ పండితులు, పీఠాధిపతులు తరలివచ్చి శ్రీరామునికి సంబంధించి పలు అంశాలపై చర్చిస్తారు. భారీగా జరగనున్న ఈ కార్యక్రమానికి వైదిక్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు తరలిరానున్నారు. శ్రీరాముని జీవిత చరిత్రను థీమ్ పార్క్ రూపంలో రూపొందించి భావితరాలకు నైతిక విలువలను అందించాలని దృక్పథంతో నారాయణం నరసింహమూర్తి ఈ రామనారాయణంను ప్రారంభించారు. ప్రస్తుతం వాల్మీకి రిసెర్చ్ సెంటర్ రామనారాయణంలో ప్రారంభించడం తమ అదృష్టమని, భవిష్యత్తులో మరిన్ని శ్రీరామునికి సంబంధించిన విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శ్రీకారం చుడతామని రామనారాయణం సిఇవో నారాయణం నీరజాశ్రీనివాస్ పేర్కొన్నారు.

## తమ్ముళ్లు వర్సెస్ సైనికులు...




**ఒంగోలు, సెప్టెంబర్ 26, పెన్ పవర్:** ఏపీలోని ఆ జిల్లాలో ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పీక్స్ కి చేరిందనే చెప్పవచ్చు. ఛోటా మోటా నాయకుల మధ్య రాజకీయ వేడి రాజుకోగా.. అది చిన్నగా టీడీపీ వర్సెస్ జనసేనగా మారబోతున్న పరిస్థితి ప్రస్తుతం ఈ జిల్లాలో కనిపిస్తోంది. ఇంతకు ఈ జిల్లా రాజకీయ సెగ రాష్ట్ర రాజకీయాలను తాకనుందా.. లేకుంటే వేడి చల్లారేనా అనేదే తేలాల్సి ఉంది. ఏపీలోని ప్రకాశం జిల్లా రాజకీయం రూటే సపరేట్. అందుకే ఈ జిల్లాలోని రాజకీయ ప్రకంపనల తాకిడి రాష్ట్ర రాజకీయాలను తాకుతుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. అయితే టీడీపీ కూటమి గెలిచిన తరువాత.. ప్రకాశం జిల్లాలో కూడా వైసీపీ హవా పూర్తిగా తగ్గిందని చెప్పవచ్చు. ఓ వైపు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఒంగోలులో పట్టు సాధించే దిశగా.. అడుగులు వేస్తున్నారు. మరోవైపు వైసీపీ పెద్దన్నగా పేరుగాంచిన ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి అనూహ్యంగా జనసేన వైపు మొగ్గు చూపారు. ఈ దశలోనే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ను ఇటీవల బాలినేని కలిశారు. ఇక్కడే ఒంగోలు పొలిటికల్ రౌండప్ ఒక్కసారిగా మారింది. బాలినేని జనసేనలో చేరేందుకు పవన్ సైతం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా.. ఒంగోలు టీడీపీ నేతలు ఒక్కసారిగా నిరసన గళమెత్తారు. టీడీపీ కూటమిలో భాగమైన జనసేనలో బాలినేని చేరికను తాము స్వాగతించేది లేదని టీడీపీ నేతలు బాహాటంగానే తమ అభిప్రాయం వ్యక్తపరిచారు. ఎమ్మెల్యే దామచర్ల సైతం.. బాలినేని అధికారంలో ఉన్న సమయంలో టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించారని, అలాగే అవినీతికి పాల్పడ్డారని, జనసేనలో చేరినా తాము వదిలే ప్రసక్తే లేదంటూ స్పందించారు. ఇలా టీడీపీ విమర్శలు గుప్పిస్తున్న తరుణంలో బాలినేని సైతం తాను పవన్ కి ఫిర్యాదు చేస్తానని, తాను ఎప్పుడూ వేధింపులకు పాల్పడలేదంటూ ప్రకటించారు. ఈ సమయంలోనే ఒంగోలులో బాలినేని అనుచరులు జనసేన పార్టీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి, అందులో బాలినేనికి స్వాగతం అంటూ.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల ఫోటోలను ఏర్పాటు చేశారు. అసలే బాలినేని ? దామచర్ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థితి ఉండగా.. ఈ ఫ్లెక్సీలు అగ్నికి ఆజ్యం పోశాయని చెప్పవచ్చు. దీనితో ఫ్లెక్సీలను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు తెలుగు తమ్ముళ్ళు. అలాగే అపరచిత వ్యక్తులు బాలినేని ఫ్లెక్సీలను చించివేశారు. ఇక బాలినేని, ఆయన అనుచరులు సైతం తాము కూడా తగ్గేదేలేదంటూ.. ఇక రివర్స్ రాజకీయాలకు సిద్ధమవుతున్నారట. ఇది ఇలా ఉంటే జనసేన పార్టీలో చేరుతున్న బాలినేనికి జిల్లా జనసేన నాయకులు సైతం మద్దతు పలికారు. ఇదే ఇప్పుడు టీడీపీ కూటమికి పెద్ద తలనొప్పిగా మారిందట. బాలినేనికి పవన్ కి మధ్య స్నేహబంధం జనసేన వైపు బాలినేనిని లాగితే.. టీడీపీ అధిష్టానం ఇంతకు ఈ విషయంలో ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. ఒంగోలు టీడీపీ నాయకులకు గప్ చుప్ అంటూ సూచిస్తుందా.. లేక బాలినేని చేరికకు టీడీపీ అడ్డు తగులుతుందా అనేది తేలాల్సి ఉంది.

## ధర్మవరంలో మళ్లీ ఫ్యాక్షన్ ..




**అనంతపురం, సెప్టెంబర్ 26, పెన్ పవర్:** ఉమ్మడి అనంతపురం జిల్లా అంటేనే ఫ్యాషన్ కు పెట్టింది పేరు. గత రెండు దశాబ్దాల క్రితం అనంతపురం జిల్లాలోని కొన్ని గ్రామాలలో ఫ్యాక్షన్ గొడవలు తారాస్థాయిలో ఉండేవి. ప్రధానంగా ధర్మవరం పెనుగొండ రాప్తాడు తాడిపత్రి నియోజకవర్గాల్లో ఈ ఫ్యాక్షన్ అధికంగా కనిపించింది. రాను రాను ఈ ఫ్యాక్షన్ కాస్త రాజకీయంగా మలుపు తిరగడం జరిగాయి. ఫ్యాక్షన్ నేతలు అందరూ కూడా వారికి నచ్చిన పార్టీలో చేరి పార్టీ జెండాను చేతపట్టి ప్రత్యక్ష రాజకీయాల్లోకి దిగారు. అయినప్పటికీ ఫ్యాషన్ మూలాలు ఉన్న నేతలు దాని నుంచి బయటపడలేక పోయారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ ఫ్యాక్షన్ నేతలదే ఆధిపత్యం చెలాయించేవారు. ఇలా ఫ్యాక్షన్ కత్తికి బలైన బడా నేతలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో చాలామంది ఉన్నారు. ఇప్పటికీ అక్కడక్కడ ఫ్యాక్షన్ కు సంబంధించి కక్షలు కార్పోణ్యాలతో రగిలిపోతూనే ఉన్నారంటే అర్థం చేసుకోవచ్చు జిల్లాలోని పరిస్థితి ఏ విధంగా ఉందో. ఫ్యాక్షన్ నేపథ్యమున్న ధర్మవరం నియోజకవర్గం ప్రత్యేకమైన స్థానం ఉంది. ధర్మవరం చాలా సెన్సిటివ్ ఏరియా ఇక్కడ పనిచేయాలంటే పోలీసులకు కూడా కత్తి మీద స్వాముల ఉంటుంది ఎప్పుడు ఎక్కడ ఏ ఫ్యాక్షన్ గొడవ జరుగుతుందో తెలియని పరిస్థితి. అలాంటి నియోజకవర్గంలో నిన్నటి రోజు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తన అనుచరుడిని సబ్ జైల్లో పలకరించేందుకు వెళ్లిన సమయంలో జైలు బయట చిన్న వివాదం చోటు చేసుకుంది. బిజెపి నేతలు, వెంకటరామిరెడ్డి డ్రైవర్ మధ్య జరిగిన ఈ గొడవ కాస్త ఉద్రిక్త పరిస్థితులకు తీసింది. దీనిపైన స్పందించిన మాజీ ఎమ్మెల్యే వెంకటరామి రెడ్డి వ్యాఖ్యలు ప్రస్తుతం సంచలనంగా మారాయి. గత ఐదు సంవత్సరాలలో ఒక్క ఫ్యాక్షన్ మర్డర్ కానీ ధర్మవరంలో జరగకుండా చూశానని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఎక్కడ కూడా శాంతి భద్రతలు దెబ్బతినకుండా ధర్మవరం నియోజకవర్గంలోని ప్రజలను తన కార్యకర్తలను అనునిత్యం చూసుకున్నానని వెల్లడించారు. కానీ మా కార్యకర్తలను అలా సైలెంట్ గా ఉండమని చెప్పి నేను తప్పు చేశానని అందుకుగాను కార్యకర్తలు నన్ను క్షమించాలని కేతరెడ్డి వెంకటరామిరెడ్డి వేడుకున్నారు. మనం అధికారంలో ఉన్నప్పుడు వారందరినీ నిలువరించి ఉంటే ఈ రోజు మనకు ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని ఆవేదన వ్యక్తం చేశాడు. ధర్మవరం నియోజకవర్గంలో కొత్త రాజకీయ పోకడలకు దారితీస్తుందని ఇది సరైనది కాదన్నారు. 2004 ముందు వరకు ఫ్యాక్షన్ గొడవలతో ఎప్పుడు ఏం జరుగుతుందో అని బిక్కు బిక్కు మంటూ ఉండే ప్రజలకు వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఫ్యాక్షన్ లేకుండా చేశారని గుర్తు చేశారు. అనంతరం మళ్లీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక మరొకసారి ఫ్యాక్షన్ వైపు తీసుకెళ్తున్నారని వెల్లడించారు. పది రూపాయలకు కూడా మర్డర్ చేసిన వ్యక్తులు ఇక్కడ ఉన్నారు. లెక్కలు నాకు తెలుసు అందరి లెక్కలు నేను సరి చేస్తా అని గట్టిగా విమర్శించారు. సబ్ జైలు పోలీస్ స్టేషన్ వంద అడుగుల దూరం కూడా లేనప్పటికీ రెండు గంటల పాటు పోలీసులు కూడా అటువైపు రాలేదని విమర్శించారు. ధర్మవరం నుంచి ఫ్యాక్షన్ భూతాన్ని తరిమికొట్టేందుకు 18 సంవత్సరాల టైం పట్టిందని మరి ప్రస్తుతం అదే విధంగా ఫ్యాక్షన్ ప్రేరేపించే విధంగా గొడవలు జరుగుతున్నాయని వీటిని సహించే ప్రసక్తే లేదని కేతరెడ్డి వెంకట్రామిరెడ్డి హెచ్చరించారు

## జగన్ కు దూరంగా ధర్మాన...



**శ్రీకాకుళం, సెప్టెంబర్ 26, పెన్ పవర్:** రాజకీయ యవనికపై అతడో అధ్యాయం. జిల్లా రాజకీయాలను ఔపోషన పట్టిన కురువృద్ధుడు. ఒకరకంగా చెప్పాలంటే.. నడుస్తున్న రాజకీయ లైబ్రరీ. అత్యంత పటిష్టమైన వ్యూహాలు, అద్భుతమైన ప్రణాళికలు రచించగల సమర్థుడు. దివంగత వైఎస్ఆర్ హయాంలో శ్రీకాకుళంతో పాటు ఉత్తరాంధ్ర రాజకీయాలు అతని చుట్టూ తిరిగేవి. టీడీపీకి కంచుకోటలాంటి శ్రీకాకుళం జిల్లాలో..కాంగ్రెస్ ప్రభంజనం సాగింది అంటే.. అది ధర్మాన వ్యూహరచన, సోషల్ ఇంజినీరింగ్ వల్లే. ప్రస్తుత స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు.రామా రావు, దివంగత మాజీ ఎమ్మెల్యే జుత్తు. జగన్నాయకులు వంటి బలహీనవర్గాలకు చెందిన నాయకులు.. ఎమ్మెల్యే టిక్కెట్లు సాధించటం వెనుక ఆయన కృషి ఎంతో ఉంది. 2009లో పది సీట్లకు గాను.. తొమ్మిది సీట్లు గెలుచుకుని..కాంగ్రెస్ సత్తా చాటింది. కానీ కాలం గిర్రున తిరిగింది. వైఎస్ఆర్ దివికేగారు. తదనంతర పరిస్థితుల నేపథ్యంలో ప్రసాదరావు.. జగన్తో కలిసి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. వాస్తవానికి అప్పుడే ఆయన పతనం ప్రారంభమైంది. కానీ అలా నెట్టుకొచ్చారు. 'జగన్ చెబితే వినడు.. సరైన వ్యూహరచన చేయడు..ప్రజలు వ్యతిరేకిస్తున్నారు' అంటూ..పలు సందర్భాల్లో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం తరువాత వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారు. వైసీపీ కార్యక్రమాలకు, జగన్ సమావేశాలకు డుమ్మాకొట్టేస్తున్నారు. తనకు అత్యంత ఇష్టమైన..వైఎస్ఆర్ జయంతి, వర్ధంతులకు కూడా ఆయన హాజరుకాకపోవడం వెనుక ఏదో నిగూడార్థం దాగుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు..ప్రస్తుతం ప్రసాదరావు తన కుమారుడు, రాజకీయ వారసుడు రామ్మనోహన్ నాయుడి కోసం అలోచిస్తున్నారని సమాచారం. వైసీపీలో రాజకీయ భవిష్యత్తు శూన్యమని ఓ నిర్ణయానికి వచ్చినట్టు భోగట్టా. అందుకే తాడేపల్లిలో జగన్ నిర్వహించిన జిల్లా స్థాయి రివ్యూ సమావేశానికి గైర్హాజరయ్యారు. దీంతో అందరి దృష్టీ ప్రసాదరావుపైనే పడింది. ఎందుకు హాజరుకాలేదన్న అంశంపై పెద్దఎత్తున చర్చ నడిచింది. అత్యంత విశ్వసనీయవర్గాలసమాచారం ప్రకారం..ఆయన రాజకీయ వైరాగ్యంలో ఉన్నారని.. రాజకీయంగా ఎటు వైపు అడుగులు వేయాలని సమాలోచనలు చేస్తున్నారని తెలుస్తోంది. ప్రసాదరావు ఆలోచనలు అన్నీ కుమారుడు, రాజకీయ వారసుడు ధర్మాన రామమనోహర్ నాయుడు మీదనే ఉన్నాయని ఆయన మనసెరిగిన వారు చెబుతున్నారు. ఏ పార్టీలో చేర్పిస్తే రాజకీయంగా నిలదొక్కుంటారు అని ఆలోచిస్తున్నారట. ఎందుకంటే 2024 ఎన్నికల్లో కుమారుడికి శ్రీకాకుళం శాసన సభ టికెట్ ని ప్రసాదరావు అడిగారు. దానికి జగన్ నిరాకరించారు అన్న ఆవేదన ప్రసాదరావులో ఉంది అని అంటున్నారు. జగన్ తండ్రి వైఎస్ఆర్తో కలిసి రాజకీయాలు చేశానని..అప్పట్లో ఎంతో విలువ ఇచ్చేవారని, కానీ జగన్ మాత్రం కనీసం గౌరవం ఇవ్వడం లేదన్న ఆవేదన సైతం ధర్మానలో ఉంది. ఈ కారణాలు విశ్లేషించుకున్న తరువాతే ధర్మాన వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారని ఆయన ఆంతరంగికులు చెబుతున్నారు. రాజకీయంగా ఒక వెలుగు వెలిగిన ధర్మాన ప్రసాద్ 2024 ఎన్నికలకు నేను పోటీ చేయను అని చెప్పిన బలవంతంగా పోటీ చేయించారు కూటమి అధికారం రావడం... ఒక భాగమైతే సర్పంచ్ స్థాయిలో ఉంటూ వ్యక్తి ఎమ్మెల్యేగా ఎదగిన గుండు శంకర్ చూసి మరి కాస్త కుమిలిపోతున్నారు. దీంతో క్యాడర్ను కూడా ఎవర్ని కలవకుండా కార్యకర్తలు ఎవరిని కూడా పార్టీ సంబంధించిన వ్యవహారాలు అయితే నా దగ్గరికి రావద్దు అని నేరుగానే చెబుతున్నారు. ఇక సొంత పని ఏదైనా ఉంటేనే మాత్రం రండి. నీ ముక్కు సూటిగానే మొహం మీద చెప్పేశారు దీంతో కార్యకర్తలు ఏం చేయాలో తెలియని అగమ్య గోచరంగా తయారయ్యారు. ధర్మాన రామ్మోహన్ నాయుడు కి రాజకీయం పూర్తిస్థాయిలో నెక్ట్స్ ఎన్నికల్లో బరిలో దించేందుకు ధర్మాన పక్కా వ్యూహం పొందుతున్నారని కొంతమంది చెబుతున్నారు.

# బుమ్రా వేసిన 15 బంతుల్లో 4 సార్లు ఔటైన కోహ్లీ.. అసహనానికి గురైన స్టార్ బ్యాటర్!

బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో దారుణంగా విఫలమైన విరాట్

నెట్ ప్రాక్టీస్‌లోనూ అదే పరిస్థితి

పేసర్ బుమ్రా బౌలింగ్‌లో ఇబ్బందిపడ్డ కోహ్లీ

స్పిన్ త్రయం అశ్విన్, జడేజా, అక్షర్ పటేల్ బౌలింగ్‌లోనూ ఇదే పరిస్థితి



బంగ్లాదేశ్‌తో చెన్నై వేదికగా జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఘోరంగా విఫలమయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో 6 పరుగులు, సెకండ్ ఇన్నింగ్స్‌లో 17 పరుగులు మాత్రమే సాధించాడు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో పేసర్ హసన్ మహ్మద్ బౌలింగ్‌లో, రెండవ ఇన్నింగ్స్‌లో స్పిన్నర్ మెహిదీ హసన్ మిరాజ్ బౌలింగ్‌లో వికెట్ సమర్పించుకున్నాడు. దీంతో కాన్పూర్ వేదికగా జరగనున్న రెండవ టెస్టులో కోహ్లీ రాణిస్తాడా లేదా అనే విశ్లేషణలు ఊపందుకున్నాయి.

**ప్రాక్టీస్ సెషన్‌లో ఘోరంగా విఫలం...**

కాన్పూర్ టెస్టుకు ముందు ప్రాక్టీస్ సెషన్లలో కోహ్లీ దారుణంగా విఫలమైనట్టు, భారత బౌలర్లను ఎదుర్కొనేందుకు తెగ ఇబ్బందిపడినట్టు కథనాలు వెలువడుతున్నాయి. నెట్స్‌లో కోహ్లీ దారుణంగా ఫెయిల్ అయినట్టు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం పేర్కొంది. ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా వేసిన 15 బంతుల్లో కోహ్లీ ఏకంగా నాలుగు సార్లు ఔటైనట్టు తెలిపింది. బుమ్రా వేసిన నాలుగవ బంతి కోహ్లీ ప్యాడ్‌లపైకి దూసుకెళ్లింది. 'నువ్వు వికెట్ లైన్ మీదే ఉన్నావ్' అంటూ ఈ సందర్భంలో బుమ్రా అప్పీల్ చేశాడు. మరో రెండు బంతుల తర్వాత ఆఫ్-స్టంప్ వెలుపలకు వెళుతున్న బంతిని కోహ్లీ వెంబడించి ఆడగా అది బ్యాట్ ఎడ్జ్‌ను తాకి స్లిప్‌లోకి వెళ్లింది. ఆ తర్వాత రెండు వరుస బంతులను బుమ్రా మార్చివేయగా వాటిని ఆడేందుకు కూడా కోహ్లీ ఇబ్బంది ఎదుర్కొన్నాడు. కోహ్లీని కొట్టిన ఒక బంతి షార్ట్ లెగ్ దిశలో క్యాచ్ పట్టుకునే అవకాశాలున్నాయి.

**స్పిన్నర్ల బౌలింగ్‌లోనూ సేమ్ సీన్...**

బుమ్రా బౌలింగ్ ఆడిన తర్వాత స్పిన్ త్రయం రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ ప్రాక్టీస్ చేస్తున్న నెట్స్ వైపు కోహ్లీ వెళ్లాడు. వారి బౌలింగ్‌లో ఆడేందుకు కూడా కోహ్లీ ఆపసోపాలు పడ్డాడు. జడేజా బౌలింగ్‌లో ఇన్‌సైడ్-అవుట్ షాట్ ఆడేందుకు ప్రయత్నించి ఏకంగా మూడు సార్లు బంతిని మిస్ అయ్యాడు. ఇక అక్షర్ పటేల్ బౌలింగ్‌లోనైతే కోహ్లీ క్లీన్ బౌల్డ్ అయ్యాడని, ఈ పరిణామంతో అతడు తీవ్ర అసహనానికి గురైనట్టు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం పేర్కొంది. కోహ్లీ ఆందోళనగా కనిపించాడని వెల్లడించింది.

# ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్ విడుదల.. టాప్-10లో కోహ్లీ పేరు గల్లంతు

12వ స్థానానికి దిగజారిన విరాట్ కోహ్లీ

5వ ర్యాంక్ నుంచి 10వ ర్యాంకుకు పడిపోయిన కెప్టెన్ రోహిత్ శర్మ

టాప్-10లోకి దూసుకొచ్చి 6వ స్థానంలో నిలిచిన రిషబ్ పంత్



ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదలయ్యాయి. ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ 899 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. న్యూజిలాండ్ బ్యాటర్లు కేన్ విలియమ్సన్, డారిల్ మిచెల్ వరుసగా 2, 3వ స్థానాల్లో నిలిచారు. ఆసీస్ ఆటగాడు స్టీవెన్ స్మిత్, భారత యువ కెరటం యశస్వి జైస్వాల్ వరుసగా నాలుగు, ఐదవ స్థానాల్లో నిలిచారు.

కాగా భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్ టాప్ 10లోకి ప్రవేశించి 6వ స్థానాన్ని దక్కించుకున్నాడు. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 39 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించడంతో అతడి ర్యాంకు మెరుగుపడింది. ఇక బంగ్లాదేశ్‌తో చెన్నైలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో పేలవ ప్రదర్శన చేసిన టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టాప్-10లో స్థానం కోల్పోయాడు. పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ ఆజం 11వ స్థానంలో ఉండగా.. విరాట్ కోహ్లీ 5 స్థానాలు దిగజారి 12వ ర్యాంక్‌లో నిలిచాడు. ఇక బంగ్లాదేశ్‌తో టెస్ట్ మ్యాచ్‌కు ముందు 5వ స్థానంలో ఉన్న టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ 10వ స్థానానికి దిగజారాడు. మిగతా భారత బ్యాటర్ల విషయానికి వస్తే శుభ్‌మాన్ గిల్ 14వ స్థానంలో నిలిచాడు. సెప్టెంబర్ 27న కాన్పూర్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరగనున్న రెండవ టెస్ట్ మ్యాచ్‌లో రాణిస్తే రోహిత్ శర్మ, కోహ్లీ ర్యాంకులు మెరుగుపడే అవకాశం ఉంది. బౌలింగ్ ర్యాంకింగ్స్ విషయానికి వస్తే శ్రీలంక యువ ఆటగాడు 5 స్థానాలు ఎగబాకి 8వ ర్యాంక్‌లో నిలిచాడు. ఇక నంబర్ వన్ స్థానంలో భారత స్పిన్ దిగ్గజం రవిచంద్రన్ అశ్విన్, 2వ స్థానంలో జస్ప్రీత్ బుమ్రా నిలిచారు. ఆ తర్వాత వరుస స్థానాల్లో ఆస్ట్రేలియా బౌలర్లు హేజిల్‌వుడ్, పాట్ కమిన్స్, దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబాడ నిలిచారు. భారత స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా ఆరో స్థానంలో, నాథన్ లియాన్ 7వ ర్యాంక్‌లో నిలిచారు.

# ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో..పంత్ @ 6

దుబాయ్ : టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్.. ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో టాప్%-%10లోకి దూసుకొచ్చాడు. బుధవారం విడుదల చేసిన తాజా జాబితాలో అతను 731 రేటింగ్ పాయింట్లతో ఆరో ర్యాంక్‌ను సాధించాడు. బంగ్లాదేశ్‌తో తొలి టెస్ట్‌లో సెంచరీ చేయడంతో పంత్ ర్యాంక్ మెరుగైంది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (751) ఒక్క స్థానం మెరుగుపడి ఐదో ర్యాంక్‌లో నిలిచాడు. స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ (716), విరాట్ కోహ్లీ (709) చెరో ఐదు ప్లేస్‌లు దిగజారి వరుసగా 10, 12వ ర్యాంక్‌లకు పడిపోయారు.

శుభ్‌మన్ గిల్ (701) ఐదు ప్లేస్‌లు ఎగబాకి 14వ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. జో రూట్ (852), విలియమ్సన్ (852), డారిల్ మిచెల్ (760), స్మిత్ (757) టాప్%-%4లో ఉన్నారు. బౌలింగ్‌లో అశ్విన్ (871), బుమ్రా (854) టాప్%-%2లోనే కొనసాగుతున్నారు. జడేజా (804) ఆరో స్థానానికి ఎగబాకగా, కుల్దీప్ యాదవ్ (679) 16వ ర్యాంక్‌లో నిలిచాడు.



అద్భుతమైన పోజులు

# తెలుగు టైర్-2.. కుర్ర భామల గట్టి పోటీ!







టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో హీరోయిన్లకు కొదవ లేదు. ఎప్పటికప్పుడు కొత్త భామలు.. చిత్రసీమకు పరిచయం అవుతూనే ఉంటారు. కొందరు డెబ్యూతోనే మంచి హిట్స్ సాధిస్తారు. మరికొందరు ఫ్లాప్స్ అందుకున్నా.. మెల్లగా క్రేజ్ సంపాదించుకుంటారు. ఇంకొందరు స్టార్టింగ్ లో సక్సెస్ అయినా.. ఇండస్ట్రీకి దూరం అయిపోతుంటారు. ఏదేమైనా.. ఇప్పుడు తెలుగులో యంగ్ బ్యూటీలు బోలెడు మంది ఉన్న విషయం తెలిసిందే. తమ సినిమాలతో అలరిస్తున్నారు. యాక్టింగ్ తో మెప్పిస్తున్నారు. అయితే తెలుగు సినీ ఇండస్ట్రీలో టైర్-1, టైర్-2 క్యాటగిరీస్ ఉన్న సంగతి తెలిసిందే. హీరోల్లానే.. హీరోయిన్లకు కూడా అవి ఉంటాయి. ఇప్పుడు టైర్-2 హీరోయిన్ల క్యాటగిరీలో టాప్ ప్లేస్ కోసం పలువురు బ్యూటీలు పోటీ పడుతున్నారని తెలుస్తోంది. వరుస ఛాన్సులు దక్కించుకుని.. టాప్ ప్లేస్ కు వెళ్లిపోవాలని ఉవ్విళ్లూరుతున్నారు భామలు. తమ అప్ కమింగ్ చిత్రాలపై నమ్మకాన్ని పెట్టుకున్నారు. కొత్త అవకాశాల కోసం చూస్తున్నారు. వారిలో మీనాక్షి చౌదరీ.. అందరి కన్నా ముందు ఉందని టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. %కూశ్రీంశీ =ఖుం% - బాలయ్య లెక్క పెరిగింది ప్రస్తుతం టాలీవుడ్ లో మీనాక్షి చౌదరీకి ఫుల్ డిమాండ్ ఉందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. అటు సీనియర్ ఇటు జూనియర్ హీరోల సినిమాల్లో యాక్ట్ చేస్తోంది. ఫుల్ బిజీ బిజీగా గడుపుతోంది. 2024 సంక్రాంతికి వచ్చిన గుంటూరు కారంలో నటించిన అమ్మడు.. రీసెంట్ గా విజయ్ ది గోట్ లో మెరిసింది. ప్రస్తుతం వెంకటేష్, అనిల్ రావిపూడి ప్రాజెక్ట్ లో యాక్ట్ చేస్తోంది. వరుణ్ తేజ్ మట్కా, విశ్వక్ సేన్ మెకానిక్ రాకీ, దుల్కర్ సల్మాన్ లక్కీ భాస్కర్, మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర చిత్రాలతో త్వరలో సందడి చేయనుంది. %కూశ్రీంశీ =ఖుం% - డిసెంబర్ లో లెక్క తేలిపోతుందిలే! రీసెంట్ గా మిస్టర్ బచ్చన్ మూవీతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన.. హీరోయిన్ భాగ్యశ్రీ బొర్సే టైర్-2 టాప్ ప్లేస్ పై కన్నేసింది. డెబ్యూ సినిమా ఫ్లాప్ అయినా.. కొందరు మేకర్స్ దృష్టిలో పడింది. స్టార్ హీరో విజయ్ దేవరకొండ మూవీలో నటిస్తోంది. రానా, దుల్కర్ సల్మాన్ మల్టీస్టారర్ లో కూడా యాక్ట్ చేస్తోంది. అదే సమయంలో హీరోయిన్ నభా నటేష్.. కొంత గ్యాప్ తీసుకున్న తర్వాత ఇప్పుడు సినిమాల్లో మళ్లీ యాక్ట్ చేస్తోంది. ప్రమాదంలో గాయపడి.. రెస్ట్ తీసుకుని.. వరుస సినిమాలు చేసేందుకు సిద్ధమైంది.

ముక్తి మోహన్ లుక్ మిమ్మల్ని ఫ్యాషన్‌తో ప్రేమలో పడేలా చేస్తుంది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com